# 5

# ముఖ్యమైన సూచనలు, ఆశ్చర్యకరమైన గురుతులు

మన గత పాఠంలో, ప్రకటనలోని గురుతులకు జనులు భయపడుతున్నట్టు మనం గమనించాం. గ్రంథంలోని ప్రారంభపు మాటలను మనం జాగ్రత్తగా గుర్తించినట్టయితే, దాని గురుతులకు ఆశ్చర్యపడనవసరం లేదు: "యేసుక్రీస్తు తన దాసులకు కనుపరచుటకు దేవుడాయనకు అనుగ్రహించిన ప్రత్యక్షత" (1:1). మొదటిగా, "ప్రకటన" అనేది *apokalupsis* అనే పదంనుండి తెనిగింపబడింది. ఈ అపొకలిప్టిక్ సాహిత్యం గురుతులతో నిండి యుంటుంది. "కనుపరచుట" అంటే, అందులో ఏమి దాచబడిందో సూచింప బడింది.[1] "సూచింపబడుట" అనేది "సూచన" అని అర్థమిచ్చు గ్రీకు పదంనుండి వచ్చింది.[2] ప్రకటన 1:1లో ఉపయోగింపబడిన ఈ పదం "గుర్తులచే వ్యక్తపరచబడుట అనే సంగతిని తెలుపుతున్నట్టు" W. E. Vine తెలిపాడు.[3] ఈ అవకాశాన్ని నొక్కి చెప్పడానికి గాను, ప్రకటన గ్రంథాన్ని పరిచయం చేస్తున్నప్పుడు, "సూచింపబడుట" అనే పదాన్ని బైబిలు ఉపదేశకులు చాక్ బోర్డుమీద "SIGN - ified" అని రాస్తారు.

ఈ గురుతులు మొదటి శతాబ్దంవారికి పరిచయమైయున్నా, మనకు పరిచయం లేదనేది మన సమస్య. గత పాఠాల్లో, ప్రస్తుత పాఠాల్లో ఈ గురుతుల భాషతో పరిచయం కలిగేలా సహాయపడడం జరిగింది. గత పాఠంలో, గురుతులను సాధారణంగా చర్చించి, వాటిని వ్యాఖ్యానించే విధానాన్ని సూచించాను. ప్రకటన గ్రంథంలో నాలుగు రకాలైన గురుతులు ఉన్నట్టు గమనించాం. వాటిలో మొదట సంఖ్యలను గురుతులుగా వినియోగించడంను ముందుగానే చూసాం. ఈ పాఠంలో మిగిలిన మూడు రకాలైన గురుతులను చూద్దాం.

## పాత నిబంధనలోనుండి గురుతుల వినియోగం

ప్రకటనలో నాల్గు వందలకు పైగా పాత నిబంధన రెఫరెన్సులున్నాయి.[4] పాత నిబంధనలోని రెఫరెన్సులలో ఎక్కువ భాగం పాత్రలకు లేక సంఘటనలకు సంబంధించినవే. పాత నిబంధనతో పరిచయమున్న ఆది క్రైస్తవులకు ఆ వ్యక్తిని గాని, సంఘటననుగాని గూర్చి ప్రస్తావించినప్పుడే, ప్రకటనలో దాన్ని ఉపయోగించిన ఉద్దేశమేమో గ్రహించే చిట్కా యివ్వబడుతుంది. పాక్షికంగా ఈ రెఫరెన్సులు కాలక్రమంలో అమర్చబడ్డాయి. ఈ కథలు నీకు పరిచయమైయుంటే, ప్రకటనను గ్రహించడానికి అవి సహాయపడతాయి.

## సృష్టి, పతనము

మొదటి ఆకాశము, భూమి (ఆది. 1:1; ప్రకటన 21:1)
ఏదెను/పరదైసు (ఆది. 2:8; 3:23; ప్రకటన 2:7)
జీవ వృక్షము (ఆది. 2:9; 3:22–24; ప్రకటన 2:7; 22:2)
మెస్సీయను గూర్చిన తొలి వాగ్దానం (ఆది. 3:15; ప్రకటన 12:7–11)

## పితరులు (ఆది. 10:1; 12:1; ప్రకటన 4:4)

రంగుల ధనస్సు (ఆది. 9:11–17; ప్రకటన 4:3; 10:1)
సొదొమ (ఆది. 18:16–33; 19:1–29; ప్రకటన 11:8)
పంద్రెండు గోత్రములు (ఆది. 35:22–26; ప్రకటన 7:4–8; 21:12)
యూదాకు వాగ్దానం (ఆది. 49:10; ప్రకటన 5:5)
యూదా సింహమునకు సూచనగా (ఆది. 49:9)

## మోషే, నిర్గమకాండము

ఐగుప్తు (నిర్గమ. 1:1, 13, 14; ప్రకటన 11:8)
పది తెగుళ్లు (నిర్గమ. 7:14–25; 8:1–32; 9:1–35; 10:1–29; 11:1–10; 12:1–32; ప్రకటన 8:7–13; 9:1–21; 11:6; 15:1–8; 16:1–21; 22:18)
పస్కా పశువు (నిర్గమ. 12:21–27; ప్రకటన 5:6)
మోషే విజయ గీతం (నిర్గమ. 15:1–19; ప్రకటన 15:3, 4)
అరణ్యము (నిర్గమ. 16:1; ప్రకటన 12:6, 14)
దేవునినుండి మన్నా (నిర్గమ. 16:31, 35; ప్రకటన 2:17)
సీనాయి కొండ (భూకంపము, మెరుపు, ఉరుము; నిర్గమ. 19:16–20; ప్రకటన 4:5)
ప్రత్యక్ష గుడారము (దేవాలయమునకు సంబంధించి రిఫెరెన్సులను చూడు) (నిర్గమ. 25:9; ప్రకటన 21:3)
నిబంధన మందసము (నిర్గమ. 25:10; సంఖ్యా. 10:33; ప్రకటన 11:19)
దీప స్తంభము (నిర్గమ. 25:31; ప్రకటన 1:12, 20; 2:1; 4:5)
బలిపీఠము (నిర్గమ. 27:1; ప్రకటన 6:9; 8:5)
ధూపము (నిర్గమ. 30:1; ప్రకటన 5:8; 8:3, 4)
జీవగ్రంథము (నిర్గమ. 32:33; కీర్తన. 69:28; మలాకీ 3:16; ప్రకటన 3:5; 20:12, 15; 21:27)
బిలాము (సంఖ్యా. 22:5; 2 పేతురు 2:15; ప్రకటన 2:14 కూడా చూడు)

## న్యాయాధిపతులు

మెగిద్దో లోయ (న్యాయాధి. 5:19; 2 దినవృ. 35:22–24; ప్రకటన 16:16)

## దావీదు ఐక్యరాజ్యము

యెరూషలేము ఏరుకోబడింది (2 సమూ. 5:5–9; ప్రకటన 3:12; 21:2, 10)
దావీదు ద్వారా మెస్సీయ రావాలి (2 సమూ. 7:8–17; ప్రకటన 5:5; 22:16)
దేవాలయము (గుడారమునకు సంబంధించి రెఫెరెన్సులను కూడ చూడు; 1 రాజులు 6:1–38; ప్రకటన 3:12; 11:19; 15:5, 8; 16:1)
దేవాలయపు ఆరాధనలో వీణెలు (1 రాజులు 10:12; 1 దినవృ. 25:6; ప్రకటన 5:8; 14:2; 15:2)

### ప్రవక్తలు, విభాగ రాజ్యము

ఏలీయా (1 రాజులు 17:1; యాకోబు 5:17, 18; ప్రకటన 11:6)
యెజెబెలు (1 రాజులు 16:31; ప్రకటన 2:20)

పాత నిబంధనలోని వ్యక్తులు సంభవాలతో పాటు పాత నిబంధనలోని అపొకలిప్టిక్ భాగాల్లోనుండి అలంకారయుత భాష కూడ ప్రకటన గ్రంథంలో కన్పిస్తుంది. ఈ క్రింద కొన్ని లేఖన భాగాలు చూడు. అసలు రెఫరెన్సులు నీవు అర్థం చేసికోలేకపోయినా, పాత నిబంధన పదజాలాన్ని ప్రకటన పదజాలంతో పోల్చి చూడడంవల్ల ఉపయోగముంటుంది.

### ప్రవక్తలు, విభాగ రాజ్యము

యెషయా

నాలుగు జీవులు (యెషయా 6:1-7; యెహెజ్కేలు 1:4-25; 10:1-22; ప్రకటన 4:6-9)
బబులోను పతనం (యెషయా 13:1-22; ప్రకటన 16:19; 17:5; 18:2)
దావీదు తాళపు చెవి (యెషయా 22:22; ప్రకటన 3:7)
ద్రాక్షల తొట్టి (యెషయా 63:3; ప్రకటన 14:14-20)
క్రొత్త ఆకాశము, క్రొత్త భూమి (యెషయా 65:17-25; 66:22-24; ప్రకటన 21:1-27; 22:1-5)

యోవేలు

మిడతలు (యోవేలు 2:1-27; ప్రకటన 9:3-10)

### ప్రవక్తలు, చెర

యెహెజ్కేలు

మెస్సీయ మరియు దేవునికి సంబంధించిన వర్ణన (యెహెజ్కేలు 1:4, 26-28; 43:2; ప్రకటన 1:12-16; 4:2, 3, 5)
పుస్తకమును భుజించుట (యెహెజ్కేలు 2:7-10; 3:1-4; ప్రకటన 10:8-11)
గోగు, మాగోగులు (యెహెజ్కేలు 38:2; 39:1, 6; ఆది. 10:2; ప్రకటన 20:8)
పక్షులకు ఆహ్వానము (యెహెజ్కేలు 39:17-20; ప్రకటన 19:17, 18)
జీవజలముల నది, దాని పొడవున చెట్లు (యెహెజ్కేలు 47:1-12; ప్రకటన 22:1-3)
అద్భుతమైన పట్టణం (యెహెజ్కేలు 48:30-35; ప్రకటన 21:12, 13, 16)

దానియేలు

మెస్సీయ మరియు దేవుని గూర్చిన వర్ణన (దానియేలు 7:1-10, 13, 14; 10:5, 6; ప్రకటన 1:12-16; 4:2, 3, 5)
మృగములు (దానియేలు 7:1-8; ప్రకటన 13:1, 2)
గ్రంథములు విప్పబడెను (దానియేలు 7:10; ప్రకటన 20:11-15)

### ప్రవక్తలు చెరనుండి తిరిగి వచ్చుట

జెకర్యా

కొలకర్ర (జెకర్యా 2:1-5; యెహెజ్కేలు 40:3; ప్రకటన 11:1, 2; 21:15)
ఇద్దరు సాక్షులు – ఒలీవ చెట్లు, దీపస్తంభాలు (జెకర్యా 4:1-14; ప్రకటన 11:3, 4)

పాత నిబంధన రిఫరెన్సులు దానికి సంబంధమున్న ప్రకటన రిఫరెన్సులతో పోల్చి

"మలుపును" చూడు. ప్రకటన రెఫరెన్సులు తరచుగా ఒకటి రెండు వివరాలతో భిన్నంగా ఉంటాయి. ఇందునుబట్టి ప్రకటన పాత నిబంధన సంగతినే మాట్లాడుతుందని తలంచ కూడదు. ప్రకటన నేరుగా పాత నిబంధనను సూచించడం లేదు. దానికి సంబంధం కలిగియున్న లేక ఆలాటి భావాలను సూచిస్తుంది. ఉదాహరణకు, ప్రకటన 7:4–8లో పండ్రెండు గోత్రాల జాబితా ఉంది. దానిలో ఉన్న మలుపును చూడలేకపోయావనుకో, అది కేవలం అక్షరార్థమైన యూదులని నీవు తలంచే అవకాశముంది. ఆ జాబితాను పాత నిబంధన జాబితాలతో పోల్చి చూచినట్టయితే (ఉదా. ఆది. 35:22–26), ఈ జాబితా తప్పని నీవు చూస్తావు. ఈ పన్నెండు గోత్రాలలో లేవీ చేర్చబడుతుంది, దాను తొలిగించబడుతుంది, వగైరాలు. ఇందును బట్టి యోహాను అక్షరార్థమైన ఇశ్రాయేలును సూచించడం లేదని నీకు తేలిపోతుంది.[5]

## గురుతులు చారిత్రక పూర్వగాధ మీద ఆధారపడియుంటాయి

ప్రకటన చదవడానికి ఆరోగ్యకరమైన చారిత్రక పూర్వ చరిత్ర ఉంది. అందులో ఏడు సంఘాలకున్న లక్షణాలు, ఆ సంఘాల్లోనికి ప్రాకుతున్న సిద్ధాంతపరమైన దోషాలు ప్రకటనను అర్థం చేసికొనడంలో అవసరమౌతాయి. రోమా సామ్రాజ్యంలో భాగంకాని (పార్తీయలాంటి) కొన్ని దేశాల చరిత్రను తెలిసికొనవలసి వస్తుంది. లేఖన భాగం చదవడంవలన వీటిలో కొన్ని సంగతులను చర్చించవచ్చు. మన ప్రాథమికమైన అవసరత – రోమా సామ్రాజ్యపు పూర్వ చరిత్ర, అది క్రైస్తవ్యానికి ఎలాటి సంబంధం కలిగియుంది తెలిసికోవాలి. రోమా సామ్రాజ్యానికున్న ఈ క్రింది పరిచయం కొంత సహాయపడవచ్చు.

### ఆరంభ చరిత్ర

క్రీ.పూ. 753లో రొమూలస్ మరియు రెముస్ అనేవారు రోమును స్థాపించారు. ఆ పట్టణము ఏడు కొండలపై కట్టబడింది, క్రీ.శ. 509లో రోమీయులు అణచివేసే ఒక రాజును తోలివేసి రిపబ్లిక్‌ను స్థాపించారు.

### జూలియస్ సీజర్ (క్రీ.పూ. 49–44)

రాజకీయవేత్తగా ఆరంభమైన జాలియస్ సీజర్ సైనిక ప్రతిభాశాలిగా రూపొందాడు. క్రీ.పూ. 49లో, రోమా సెనేట్‌ను సైనికబలంతో రద్దుపరచి, నియంతగా తన్నుతాను కనుపరచుకొని జూలియో క్లాడియన్ రాజవంశాన్ని స్థాపించాడు.[6] రోమా సామ్రాజ్య స్థాపకుడనే ఘనతను అతడు పొందాడు. కడకు "కైసరు" అనే బిరుదు రోమా చక్రవర్తికి సాధారణంగా వర్తింపచేయబడింది.[7]

జూలియస్ సీజర్ దైవ సంభూతుడుగా భావింపబడ్డాడు, దేవాలయాలు అతని పేరిట కట్టబడి అతనికి సమర్పించబడ్డాయి. కిరీటాన్ని అతడు త్రోసిపుచ్చాడు, అయితే ఎప్పుడో ఒకసారి తన్ను రాజుగా ప్రకటించుకుంటాడని అనేకులు భీతిచెందారు. క్రీ.పూ. 44 మార్చి 15వ తేదిన అతడు బ్రూటస్, కాసియస్ వగైరాలచే దారుణంగా హత్య చేయబడ్డాడు.

**ఆగస్టస్ సీజర్ (కైసరు ఔగుస్తు) క్రీ.పూ. 27 – క్రీ.శ. 14)**[8]

ఆక్టేవియన్, జూలియస్ సీజరుకు సోదరుని కుమారుడో మేనల్లుడో – మొత్తానికి అతనిని దత్తత తీసికొని జూలియస్ అతని (ఆక్టేవియన్ను) తన వారసునిగా చేసికొన్నాడు. జూలియస్ సీజరు చనిపోయిన వెంటనే సామ్రాజ్యం అంతర్యుద్ధంలో మునిగిపోయింది. అనేక యుద్ధాల అనంతరం ఆక్టేవియన్ రోమా తొలి చక్రవర్తిగా రూపొందాడు. క్రీ.పూ. 27లో, రిపబ్లికన్ ప్రభుత్వాన్ని అతడు ప్రకటించాడు, సెనెట్ అతనికి ఆగస్టస్ ("హెచ్చించబడినవాడు") అనే బిరుదునిచ్చింది. సెనెట్ సలహా సంఘంగా, అతడు జాతీయ అసలైన అధికారిగా గుర్తింపబడ్డాడు.

"కాలము సంపూర్ణమైన" సంగతి ఎరుగకుండగానే రోమా సామ్రాజ్యం క్రైస్తవ్యం కొరకు ఆగస్టస్ పరిపాలన మార్గం సరళం చేసింది (గలతీ. 4:4). *Pax Romana* రోమీయుల శాంతి, గ్రీకు భాషా విస్తిరణ (క్రొత్త నిబంధన *Koine*[9] గ్రీకులో వ్రాయబడింది), సామ్రాజ్యమంతటిని కలిపే రోడ్ల నిర్మాణం, వగైరాలు జరిగాయి. క్రీస్తు ప్రభువు జన్మించినప్పుడు (కైసరు ఔగుస్తు) ఆగస్టస్ ఏలుబడి చేస్తుండేవాడు (లూకా 2:1).

**తిబెరయ (కైసరు) సీజర్ (క్రీ.శ. 14–37)**

ఆగస్టస్‌కు తిబెరయ మారు కొడుకు అల్లుడునైయున్నాడు. ఆగస్టస్ మరణానంతరం తిబెరయ (Tiberius) రోమా చక్రవర్తి అవుతాడు. ప్రభువువారి వ్యక్తిగత పరిచర్య, మరణకాలంలో యితడు ఏలుబడి చేస్తూ ఉండేవాడు (లూకా 3:1). సంఘ ఆరంభం తరువాత కూడ అతడు అధికారంలో కొనసాగాడు.

**గేయస్ కాలిగులా (క్రీ.శ. 37–41)**

కాలిగులా, తిబెరయకు సహోదరుని కుమారుడైయుండి చక్రవర్తి అయ్యాడు. పలు సంవత్సరాల తరువాత, అనారోగ్య కారణంగా, మానసికంగా స్థిమితం లేనివాడయ్యాడు ("పిచ్చి చక్రవర్తియని" అతడు పిలువబడ్డాడు). అతడు ప్రధానంగా యూదులకు విరోధంగా హింస ఆరంభించాడు. తన చుట్టునున్నవారిమీద తన క్రూరత్వాన్ని ప్రదర్శించినప్పుడు, తన సొంత అధిపతులే అతన్ని హత్యచేశారు. ఇతడు క్రొత్త నిబంధనలో ప్రస్తావించబడలేదు.

**క్లౌదియ సీజరు (క్రీ.శ. 41–54)**

తిబెరయకు క్లౌదియ సహోదరుని కుమారుడు కాలిగులాకు అంకుల్, కాలిగులా హత్య చేయబడిన తరువాత, చక్రవర్తి సంబంధమైన కావలివారు క్లౌదియను చక్రవర్తిగా ప్రకటించారు. క్లౌదియ ఏలుబడిలో, ఐగుప్తు, ఉత్తర ఆఫ్రికా, సిసిలీ, స్పెయిన్, సైప్రస్, బ్రిటన్, గ్రీసు, బాల్కన్ దేశాలనుండియు, యితర ప్రాంతాలనుండియు సరకులు ప్రవాహంగా వస్తూ, రోము (వ్యాపార) వర్తక కేంద్రంగా మారింది.

క్రొత్త నిబంధనలో క్లౌదియ రెండుసార్లు ప్రస్తావించబడ్డాడు (అపొ. 11:28; 18:2). రోమునుండి అతడు యూదులను వెళ్ళగొట్టినప్పుడు (అపొ. 18:2), అతడు క్రైస్తవులను

కూడ వారితో చేర్చియుండవచ్చు. అయితే, అతడు క్రైస్తవులను మాత్రం హింసించడానికి ప్రత్యేకించినవాడు కాడు. తన కొడుకైన నీరో రాజు కావాలని కోరుకున్న అతని నాల్గవ భార్య (తన మేనకోడలు) అతనికి విషం నూరి పోసింది.

**నీరో (క్రీ.శ. 54-68)**

నీరో కాలిగులాకు సహోదరుని కుమారుడును, క్లౌదియకు పెంపుడు కొడుకునై యున్నాడు. తన ఏలుబడిలోని తొలి భాగమందు, మంచి మనుష్యులచే అతడు సలహా పొందాడు. అపొ. 25:10-12లో, పౌలు విన్నపం చేసికోగోరిన చక్రవర్తి యితడే. తన తొలి ఖైదీనుండి పౌలు విడిపింపబడిన కాలంలో, స్వార్థపరులును, శత్రువులుగా పరిగణించుకునేవారు నీరోను వశంచేసికొన్నారు - అతని ఏలుబడి త్వరలోనే పతన మయ్యింది. క్రీ.శ. 64లో, రోమాను తుడిచేసిన అగ్ని ప్రమాద నేరానికి నీరో బాధ్యుడు కాగా, ఆ నేరాన్ని అతడు క్రైస్తవులమీద మోపాడు. ఈ విధంగా రోమా ప్రభుత్వముచేత క్రైస్తవులు తొలిసారిగా ప్రత్యేకించి హింసింపబడ్డారు.[10]

రోమీయులలో అనేకులు నీరోను నమ్మలేదు. క్రీ.శ. 68లో, స్పెయిన్‌లో ఉన్న రోమా సైన్యం తిరుగుబాటుచేత, వారి నాయకుడైన గాల్బను చక్రవర్తిగా ప్రకటించారు. నీరో పారిపోయాడు. అతడు పట్టబడినప్పుడు, ఆత్మహత్య చేసికున్నాడు. ఈ విధంగా జూలియో-క్లౌదియ రాజవంశం అంతరించింది. కొందరి రోమీయుల హృదయాలలో ఒక విశేషమైన స్థానాన్ని నీరో సంపాదించుకున్నాడు. ఏదో యొక రోజు "నీరో తిరిగి వస్తాడనే" వదంతి పుట్టింది (Nero redivivus myth).[11]

**"నలుగురు చక్రవర్తుల సంవత్సరం" (క్రీ.శ. 68-69)**

నీరో మరణానంతరం కొంతకాలం కలతనిండింది. నలుగురు చక్రవర్తులు ఒకరి వెంట ఒకరు, రోమా సైన్యంలోని ఒక్కొక్క దళంచేత సపోర్టు చేయబడి త్వరితగతిని మరుగయ్యారు. వారిలో మొదటి ముగ్గురు కేవలం "హక్కుదారులుగా" లేదా "మోసగారులుగా" ఉన్నారు: గాల్బ (జూన్ 68 - జనవరి 69), ఓదో (జనవరి - మార్చి 69), విట్టేలియస్ (ఏప్రిల్ - డిశంబరు 69.) (వీరితో ఆరంభించి, మిగిలిన చక్రవర్తులెవ్వరి పేరు బైబిల్లో ప్రస్తావించబడలేదు). నాల్గవవాడు వెస్పేసియన్. యూదుల తిరుగుబాటును అణచడానికి ఇతడు క్రీ.శ. 67లో నీరోచే పాలస్తీనాకు పంపబడ్డాడు - తరువాత తన కుమారుడైన టైటస్ స్వాధీనంలో సైన్యాన్ని ఉంచి, అతడు తిరిగి రోముకు వస్తాడు.

**ఫ్లేవియస్ వెస్పేసియన్ (క్రీ.శ. 69-79)**

డిశంబరు క్రీ.శ. 69లో వెస్పేసియన్ సెనెట్‌చేత చక్రవర్తిగా స్థిరపరచబడ్డాడు. తిరిగి చెలరేగే అంతర్యుద్ధాలను నిరోధించడానికి గాను, తనకు వారసునిగా తన కుమారుడైన టైటస్‌ను అతడు నియమించాడు. ఈ విధంగా ఫ్లేవియస్ రాజవంశము ఆరంభమయ్యింది.

**టైటస్ (క్రీ.శ. 79–81)**

క్రీ.శ. 70లో యెరూషలేమును నాశనం చేసిన రోమీయుడుగా టైటస్ ప్రసిద్ధి చెందాడు. రోములో కట్టబడిన ఆర్చ్ నిర్మాణం ఈ సంఘటనకు జ్ఞాపకార్థ చిహ్నంగా ఉంది. రోములోని ప్రఖ్యాతిగాంచిన కొలాసియం నిర్మాణాన్ని పూర్తిగావించిన ఘనత టైటస్‌కే దక్కింది. దీన్ని అతని తండ్రి ప్రారంభించాడు. ఇతని కాలంలో వెసువియస్ పర్వతంలోనుండి లావా పొంగి పాంపే మరియు దాని సమీప పట్టణాలను పాడుచేసింది. జ్వరముతో టైటస్ క్రీ.శ. 81లో మరణించాడు.[12]

**డొమిషియన్ (క్రీ.శ. 81–96)**

టైటస్ తరువాత తన తమ్ముడైన డొమిషియన్ సింహాసనానికి వచ్చాడు.[13] మితిమించిన అభ్యుదయేచ్ఛ డొమిషియన్‌కు ఉండడంవలన అటు తన తండ్రి వెస్పేసియన్ గాని, యిటు తన అన్నయైన టైటస్‌గాని అతనికి ప్రభుత్వ రంగంలో ఎక్కువ ప్రమేయం కలిగించ లేదు. కొన్ని విధానాల్లో, డొమిషియన్ ప్రభావితమైన చక్రవర్తియే. తన ఏలుబడి కాలంలో, రోమా సామ్రాజ్య సరిహద్దులు బ్రిటిష్ దీవులనుండి, ఆఫ్రికా ఎడారివరకును, అట్లాంటిక్ మహా సముద్రమునుండి యూఫ్రటీస్ నదివరకును విస్తరించాయి.[14]

అనేక ప్రాచీన ఆచారాలను డొమిషియన్ పునరుద్ధరించాడు – అందులో చక్రవర్తి ఆరాధన కూడ ఉంది. బహు తక్కువమంది చక్రవర్తి ఆరాధనను తీవ్రంగా పరిగణించారు గాని డొమిషియన్ దాన్ని తీవ్రంగా తీసికొన్నాడు. అతడు "ప్రభువా, దేవా" అనే బిరుదును తనకొరకు తీసికొన్నాడు. చక్రవర్తి విగ్రహానికి పూజ చేసేలా అధికార వర్గాలను అతడు పనిగా నియమించాడు.[15]

> సంవత్సరంలో ఒకసారి *kaisar kurios* కైసరు ప్రభువు అని, దానికి సాక్షాధారంగా (కైసరు) సీజరు దేవత్వంపై రవ్వంత ధూపం వేయడానికి డొమిషియన్ యొక్క న్యాయాధికారుల ఎదుట ప్రతి ఒక్కరు నిలవాలి. నమ్మకత్వపు పరీక్ష ముగిసిన తోడనే, ఒక సంవత్సర మంతటికి చెల్లే సర్టిఫికేట్ యివ్వబడుతుంది.[16]

డొమిషియన్ దృష్టిలో, చక్రవర్తి ఆరాధన అనేది ప్రభు భక్తిని చాటేదిగాను, సింహాసనానికిని సామ్రాజ్యానికిని నమ్మకత్వాన్ని ప్రకటించేదిగాను ఉంటుంది. అతన్ని దేవతగా భావించకపోతే రాజ ద్రోహానికి తక్కువగా అది ఎంచబడదు.

క్రైస్తవులు డొమిషియన్ను[17] ఆరాధింప నిరాకరించినప్పుడు, సంఘముపై సామ్రాజ్య వ్యాప్తంగా హింసను ఏర్పాటు చేశాడు. సాధారణమైన శిక్షలు, చిత్రహింసలు, మరణం (సాధారణంగా శిరచ్ఛేదనం చేయడం), దేశ బహిష్కరణ, ఆస్తులు జప్తులు చేయడం వంటివి జరిగాయి. ఇందులో పౌరులకున్న హక్కులు, అవకాశాలను తొలిగించడం చాలా గొప్ప శిక్షగా తలంచబడుతుండేది.

తన ఏలుబడి చివరిలో, డొమిషియన్ మానసికంగా ఎంతో దెబ్బతిన్నాడు. అతని చుట్టు ఉన్న ఎవరూ క్షేమంగా ఉండలేకపోయారు. అతని భార్యయు అతని యిద్దరు కావలివారును అతనికి వ్యతిరేకంగా కుట్రపన్నారు. క్రీ.శ. 96 సెప్టెంబరులో, ఒక

హంతకుడు అతన్ని కత్తితో పొడిచాడు. డొమిషియన్ జ్ఞాపకాన్ని సెనెట్ శపించింది, బహిరంగ జ్ఞాపక చిహ్నంలోనుండి అతని పేరు తుడిచివేయబడింది. దానితో ఫ్లేవియన్ రాజవంశము అంతరించింది.

## తరువాత చరిత్ర – సామ్రాజ్య పతనము

డొమిషియన్ తరువాత: నెర్వా, ట్రేజన్, హార్డియన్, ఆంటోనియస్ పియస్, మార్కస్ అరేలియస్ అనే "అయిదుగురు మంచి చక్రవర్తులు" వచ్చారు. వారి పరిపాలనా కాలంలో సామ్రాజ్యపు సంపద ఉచ్ఛ స్థితికి చేరుకుంది. అయితే రోముయొక్క అంతానికి వారి "పరిపాలనా కాలమే అంతమైయుందని" చెప్పబడింది:

> హర్డియన్ క్రింద అలజడి చేసే అనాగరికులకు వ్యతిరేకంగా రోము ఎన్నడో దాడిచేయగలిగింది కాక, రోము తన్నుతాను కాపాడుకునే యత్నంలోనే మిగిలిపోయింది. ఆంటోనియస్ పయస్, మార్కస్ అరేలియస్‌ల క్రింద బలహీనతకు చిహ్నాలు, చెడిపోవడం లాంటివి విదితమయ్యాయి. ఇది రోమా సామ్రాజ్య ప్రభుత్వానికి శ్రేష్ఠమైనదియు ఆనందదాయకమైన కాలమైయున్నా, దాని అంతానికి ఆరంభంగా ఉంది.[18]

*Pax Romana*ను మార్కస్ అరేలియస్ పాలన అంతం చేసింది. వంద సంవత్సరాల యుద్ధానికి శ్రీకారం చుట్టింది. సైన్యం చక్రవర్తులను సింహాసనాన్ని ఎక్కించింది, యిష్టం వచ్చినప్పుడు దించింది. 313లో మిలానులో కాన్‌స్టాంటైన్ ఒక శాసనాన్ని చేశాడు. దానితో క్రైస్తవ్యం చట్టబద్ధమైన మతమయ్యింది. కాన్‌స్టాంటైన్ మరణానంతరం, అక్రమ కాలం కొనసాగింది. 576లో రోము పాశ్చాత్య సామ్రాజ్యము కూలిపోయింది – బైజెన్‌టైన్ సామ్రాజ్యము – తూర్పు సామ్రాజ్యము – మరొక వెయ్యి సంవత్సరాలు కొనసాగింది.

రోమా సామ్రాజ్యము "ఎన్నడూ సాధింపబడిన మహా ఘనమైన రాజకీయ సాధన" యని పిలువబడింది. "జూలియస్ సీజరు అతని వారసుడైన ఆగస్టస్‌చే పెంపారచేయబడిన దృఢమైన నిర్మాణంతో పోల్చితే మహా అలెగ్జాండరు, చార్లెమగ్నే, నెపోలియనుల విజయ యాత్రలు ఎన్నదగినవిగా ఉండవు."[19] దేవుణ్ణి విరోధిగా చేసుకొనడానికి అది తీర్మానించు కొనకపోయి ఉంటే, రోమా సామ్రాజ్యం ఎంత కాలం కొనసాగియుండేదో ఎవరికి తెలుసు?"[20]

## రోము క్రైస్తవులను ఎందుకు హింసించింది?

రోముకు సంబంధించనివాటిని అనుమతిపొందిన, అనుమతిని పొందని మతాలుగా వర్గీకరించారు. అనుమతిలేని మత సభ్యులను చట్టం శిక్షిస్తుంది. కాని రోము ప్రభుత్వం సాధారణంగా ఆ మతాలు రాష్ట్రంలోని శాంతిని భంగం చేయనంతవరకు, సమాజ నీతికి విఘ్నం కలిగించనంతవరకు సహిస్తుంది. ఏమైనా అనుమతి రహిత మతాల నియమావళిని, అవసరమైతే ఉపయోగించుకోడానికి చట్ట గ్రంథంలో ఉంచారు. (అధికారయుతమైన మతం దేశ క్షేమాన్నుద్దేశించి రాజకీయం సైనిక రూపానికి మారింది కాని వ్యక్తిగతమైన స్వేచ్ఛకోసం కాదు. అనేకమంది రోమనులు పలు మతాలను అవలంభించారు.)

క్రైస్తవ్యం అనుమతి పొందని మతమైయుంది. ఆరంభ చరిత్రలో అది రోము దృష్టిని ఆకర్షించలేదు. ఎందుకంటె, అది అనుమతిపొందిన యూదా మతంలోని ఒక శాఖగా గుర్తింపబడింది. ఏదియెలాగున్నా, నీరో కాలంనుండి క్రైస్తవ్యం అనుమానించబడింది.

కొన్ని కారణాలను బట్టి రోముకు క్రైసవ్యానికి మధ్య సంఘర్షణ తప్పని సరియైయుంది. మొదటిగా, ఆ రెండును లోక వ్యాప్తమైన సామ్రాజ్యాలే. రెండు, కొద్దికాల వ్యవధిలోనే అవి రంగస్థల ప్రవేశం చేశాయి. మూడు, రెండును మనుష్యులందరి సంపూర్ణ విశ్వాసాన్ని కోరాయి. "ఖడ్గమునే గాని సమాధానమును పంపుటకు నేను రాలేదని" ప్రభువైన యేసు అన్నారు (మత్తయి 10:34). క్రైస్తవ్యం యొక్క సత్యం దోషంతో అనివార్యంగా సంఘర్షణ పడుతుంది. తనకు లభ్యమయ్యే ప్రతి సాధనతో అపవాది క్రీస్తుతో పోరాడతాడు – రోమా సామ్రాజ్యాన్ని గాక శక్తివంతమైన ఏ యితర ఆయుధాన్ని వాడు వాడుకొంటాడు?

అనుమతిపొందని మతాలన్నిటిలో, శిక్షించడానికి క్రైస్తవ్యం వేరు చేయబడింది. అలాగు ఎందుకు అనడానికి కొన్ని వీలైన కారణాలు ఈ క్రింద యివ్వబడ్డాయి:

1. "రాజ్యమును" గూర్చి క్రైస్తవ్యం ఎక్కువగా చెప్తుతుంది, ఆత్మ సంబంధమైన రాజ్యానికిని భూసంబంధమైన రాజ్యానికిని మధ్యగల వ్యత్యాసం ఎక్కువమంది ప్రజలు అర్థంచేసుకోలేదు.

2. లోకాంతానికి సంబంధించిన క్రైస్తవ భావాలు విప్లవ సంబంధమైనట్టు వినిపించాయి. సమస్తమును లయమైపోయే విషయాలను క్రైస్తవ ప్రసంగీకులు మాట్లాడారు.

3. తటాలున కన్పించినట్టున్న క్రైస్తవ్యం అనేకమంది అనుచరులు కలిగినదైనందున ప్రభుత్వ సంబంధమైన నాయకులకు పిరికితనం కలిగించింది.

4. క్రైస్తవ్యం సహనం గలది కాదు. అనేక యితర మతములవలె, ఒకడు క్రైస్తవుడైయుండి వేరొకడైయుండలేడు. క్రైస్తవుడు కావాలంటే, ఒక వ్యక్తి ముందు తనకు పవిత్రంగా ఉంచుకున్న ప్రతిదాన్ని వదలుకోవలసియుంటుంది.

5. క్రైస్తవ్యం ప్రత్యేకమైనది. క్రైస్తవులు తరచుగా రాత్రులలో కూడుకునేవారు. వాటిని కొందరు "రహస్య కూడికలు"గా భావించారు. క్రైస్తవ ఉపదేశాలు ఆచరణలు (కొన్ని సార్లు కావాలనే) వక్రంగా త్రిప్పి, భక్తిహీనతను వ్యభిచారాన్ని వారికి అంటగట్టారు. త్రాగుబోతులని, జగడమాడువారని, జారులని, పిల్లలను హత్యచేయువారని, నరమాంస భక్షకులని అన్యాయంగా వారు నిందించబడ్డారు.

6. ప్రభుత్వము దృష్టిలో, క్రైస్తవులు మూర్ఖపు పట్టుదలగలవారు. బలిపీఠంమీద కొంచెం కర్పూరము వంటి ధూపవస్తువు అర్పించుడని రోమీయులు క్రైస్తవులను కోరేవారు. వారి దృష్టిలో, అది విశేషమైన కోరిక కాదు.

7. క్రైస్తవులు నాస్తికులుగా భావించబడేవారు ఎందుకంటె యితర విశ్వాసులకు సంబంధించిన దేవతలు వారి దృష్టిలో దేవుళ్లే కాదు.

కాలం జరిగే కొలది, ప్రతివిధమైన ఈతి బాధకు క్రైస్తవులు నిందింపడ్డారు. క్రైస్తవ్యం స్థాపింపబడక ముందునుండే ఈతి బాధలు, విపత్తులు సంభవించుచునే ఉన్నాయని క్రైస్తవ నాయకులు సూచించారు. పైగా, ఆపదలు తగిలినప్పుడు, స్వార్థాన్ని త్యాగం చేసికొని జనులకు సహాయం చేయడంలో బహుగా ప్రయాసపడేవారు. ఆలాటి

వాస్తవాలవైపు దృష్టిని మరల్చజూచినా, సమస్య పరిష్కారం కాలేదు. ఎందుకంటే, పరపక్ష ద్వేషం అరుదుగా హేతువును అపేక్షిస్తుంది.[21]

### రోము యొక్క వైరి: పార్తీయ

పెంతెకొస్తు దినానికి హాజరైన దేశాలను లూకా అపొ. 2లో రికార్డు చేసినప్పుడు, అతడు పార్తీయులను అందులో చేర్చాడు (9 వ.). పార్తీయ దాదాపు 300 మైళ్ళు పొడుగు, 120 మైళ్ళు వెడల్పుగలదై, కాస్పియన్ సముద్రానికి ఆగ్నేయ దిశగా ఉంటుంది. అది ప్రస్తుతం ఉత్తర ఇరాన్ మరియు దక్షిణ టర్క్ మెనిస్తాన్ అనబడుతుంది. అది సారవంతమైనది కాని పర్వత ప్రాంతమైయుంటుంది.

ప్రకటన రచన వచ్చేసరికి, ప్రాచీన పారసీక సామ్రాజ్యంలో ఎక్కువ భాగాన్ని తీసికొని, పశ్చిమమున యూఫ్రటీసు నది మొదలుకొని తూర్పున ఆఫ్గనిస్తాన్‌వరకు విస్తరించిన ప్రాంతాన్ని ఏలుతూ ఉంది. రోము సామ్రాజ్యపు సరిహద్దుల్లో గుర్తింపు పొందగల సైనిక బలం దీనికి మాత్రమే ఉంది, మరియు వందలకొలది సంవత్సరాలుగా రోము ప్రక్కలో ముల్లుగా అది నిలిచిపోయింది.



కిరీటమును ధరించి విల్లుపట్టుకొని సవారి చేయువాడు (6:2)

ప్రకటన గ్రంథములోని అలంకార భాష పార్తీయులకు కొంత సంబంధించి ఉండవచ్చు. ఉదాహరణకు, 6:2లో విల్లు చేతపట్టుకొని కిరీటము ధరించిన రౌతు పారసీక/పార్తీయ నాణెములు జ్ఞాపకం చేస్తున్నాయి. "పార్తీయ యోధులు నిపుణులైన రౌతులును విలుకాండ్రునైయున్నారు. తమ శత్రువులమీదికి బాణాలు ఎక్కుపెట్టి కొట్టగల వారి నేర్పు నిజంగా వేసేటప్పుడును లేక పోరాడునట్టు నటించేటప్పుడును 'పార్తీయులవేటు' అనే సూక్తిని పుట్టించింది, అంటే ఆఖరి మాట చెప్పుట అని అర్థం."[22]

పార్తీయాకు సాధారణంగా వర్తించే సూచనలు 9, 16 అధ్యాయాల్లో కన్పించవచ్చు: 9వ అధ్యాయం "మహానదియైన యూఫ్రటీసు"ను గూర్చి మాట్లాడుతుంది, అక్కడ నలుగురు దూతలు మనుష్యులను శిక్షించడానికి విడిచిపెట్టబడ్డారు; ఆ దూతలు తరువాత "రౌతుల సైన్యముగా" గుర్తించబడ్డారు (14–16 వచనాలు). తిరిగి 16వ అధ్యాయం "మహా నదియైన యూఫ్రటీసు," "తూర్పుననున్న రాజులతో" పాటు ప్రస్తావిస్తుంది (12 వ.). తన ఉద్దేశాలను నెరవేర్చుకొనడానికి ఈ రాజులు దేవునిచే వినియోగింపబడతారని అందు గుప్తంచేయబడియుంది.

రోమా సామ్రాజ్యానికి పార్తీయాయు యూఫ్రటీసు నదియు ఏమి సూచిస్తుందో రోము చరిత్రలోని ఒక సంభవం ఉదహరిస్తుంది. జూలియస్ సీజరుతో[23] మహా పాంపే, మార్కస్ లినియస్ క్రాసస్ కలిసి "మొదటి Triumvirate"గా రూపొందారు. కీర్తిలోను ధనంలోను సీజరుతో పోటిపడాలని తీర్మానించుకొన్నవాడై, క్రాసస్ పార్తీయాను వశపరచుకోవాలని తీర్మానించాడు. క్రీ.పూ. 53లో, అతడు యూఫ్రటీసు దాటి ముందుకు సాగాడు. కారే [Carrhae] లోని యుద్ధంలో 20,000 మంది రోమీయులు చనిపోయారు

10,000మంది బందీలుగా కొనిపోబడ్డారు. రోమీయుల గౌరవ చిహ్నాము పోయింది, క్రాసస్స్ చంపబడ్డాడు. ఆ తరువాత పార్తీయులు యూఫ్రటీసు దాటి వచ్చి దక్షిణ సిరియాను కొల్లగొట్టుకుపోయారు. "తూర్పు రాజులు" "మహానది యూఫ్రటీసును" దాటి దాడి చేస్తారనే ఆలోచన రోమా సైన్యాధిపతి వెన్నుపూస గడ్డ కట్టిస్తుంది.

క్రీ.శ. 224లో సస్సానియులు పార్తీయ రాజ వంశాన్ని జయించినందున, రోమా సామ్రాజ్యాన్ని కూలద్రోయడానికి అక్షరార్థంగా బాధ్యులు కారు. గనుక, ప్రకటనలో పార్తీయుల రూపవర్ణనను అక్షరార్థంగా తీసికోకూడదు. కాని, రోమా సామ్రాజ్యాన్ని నాశనం చేయడానికి, దేవునిచే ఉపయోగింపబడిన శక్తులకు అది గురుతుగా నిలుస్తుంది – ఒక వేళ సైనిక బలమే కావచ్చు. రోమా సామ్రాజ్యం కూలిపోవడానికి వెలుపలనుండి జరిగిన దండయాత్ర ముఖ్యమైన కారణమైయుంది.[24]

**రోము ఎందుకు పతనమయ్యింది**

రోము పతనానికి Ray Summers (రే సమ్మర్స్) మూడు కారణాలను ఆరోపించాడు: "... మూడు కారణాల కలయికతో రోమా సామ్రాజ్యము పతనమయ్యింది: ప్రకృతి వైపరీత్యాలు (ఈతి బాధలు) అంతర్గత క్రుళ్ళు, మరియు వెలుపటినుండి దాడి."[25]

*The Decline and Fall of the Roman Empire* రచయితయైన Edward Gibbon అంతర్గతంగా చెడిపోవడమనేది తీర్మానించు హేతువుగా నమ్ముతూ, రోమా పతనానికి అయిదు కారణాలున్నట్టు పేర్కొన్నాడు:

- విడాకులు అతి ఎక్కువగుట: మానవ సమాజానికి ఆధారమైయున్న కుటుంబం యొక్క గౌరవము, పవిత్రతను తేలిక చేయుట.

- హెచ్చయిన పన్నులు, ప్రజల డబ్బును ఉచిత భోజనానికిని సామాన్య జనుల తైతక్కలకు ఖర్చుపెట్టుట.

- సంతోషము కోసం అర్రులు చాచడం; ఏటి ఏటికి క్రీడలపై ఉత్కంఠ పెరగడం, అతి కఠినంగా మారడం.

- నిజమైన శత్రువు లోపలనే ఉండగా, బ్రహ్మాండమైన యుద్ధ సామాగ్రులను చేర్చుట: ప్రజల క్షీణత.

- మతం చెడిపోవుట – విశ్వాసం కేవల రూప మాత్రమగుట – జీవనంతో సంబంధం లేకుండపోయి ప్రజలను హెచ్చరించుటకు, నడిపించుటకు శక్తిలేనిదై పోవుట.[26]

Summersచే చెప్పబడిన రెండవ కారణం కింద గిబ్బను అయిదు కారణాలు సబ్

పాయింట్సుగా తలంచవచ్చు.

ప్రకటన పఠనం మనం ప్రారంభించేటప్పుడు ఈ కారణాలను మనస్సులో ఉంచుకో. గ్రంథం సింబాలిజంలో వీటిని మాటిమాటికి తరచి చూస్తుంటాం.

## ప్రకటనకే ప్రత్యేకమైన గురుతులు

ప్రకటనలోని గురుతులు బహు ప్రత్యేకమైనవి. తన అపొకలిప్టిక్ సాహిత్యంలో కూడ పాత నిబంధనయందు అవి కన్పించవు – చారిత్రక రికార్డుల్లో సయితం లేవు. భయంకరమైన ఎర్రని మహా ఘటసర్పము, గత పాఠంలో చదివిన స్త్రీయు ఈ ఉదాహరణలలో చేర్చబడతాయి. ఆమె ఆ ఘట సర్పము ఎదుట నిలిచింది (12 అధ్యాయం). ఈ గురుతుల జాబితా చూచేదానికి బదులు, లేఖనాల్లో అవి వచ్చినప్పుడు వాటిని చూస్తాం. ఈ గురుతులలో కొన్ని లేఖనాల్లోనే వివరించబడ్డాయి (12:9 చూడు). కొన్నింటిని సందర్భాన్నిబట్టియు, ప్రకటన సందేశ సారాన్నిబట్టియు మనం వివరిస్తూ ఉండవలసి వస్తుంది.

## ముగింపు

ప్రకటన గ్రంథములోని నాలుగు ప్రాథమిక రకములైన గురుతులు అనే మన పాఠం దీనితో ముగిస్తుంది: (1) సంఖ్యలు గురుతులుగా ఉపయోగింపబడ్డాయి, (2) పాత నిబంధననుండి గురుతులు, (3) చారిత్రక పూర్వగాథనుండి గురుతులు మరియు (4) ప్రకటనకే సొంతమైయున్న గురుతులు.

ఇతరమైన గురుతులు కూడ ఈ గ్రంథంలో కన్పిస్తాయని నేను ముందుగానే ప్రస్తావించాను. ఉదాహరణకు, రంగులు గురుతులుగా ఉపయోగించబడ్డాయి:

> గురుతుల సాహిత్యంలో తెలుపురంగు సామాన్యంగా విజయానికి గురుతుగా కన్పిస్తుంది. … ఎరుపు రంగు తరుచుగా యుద్ధాన్ని లేక సంఘర్షణను సూచిస్తుంది. నలుపు ఏదోయొక లేమిని, కరువులో ఆహార లేమి, తెగులువంటిదానిలో ఆరోగ్య లేమిని సూచిస్తుంది.[27]

కొన్ని క్రొత్త నిబంధన గురుతులను సయితం మనం కనుగొంటాం. ప్రకటన రాసే సమయానికి, క్రొత్త నిబంధన రచనలలో కొన్ని దశాబ్దాలుగా ప్రచారంలో ఉన్నాయి. క్రీస్తు "నిష్కళంకమైన గొర్రె"గాను (1 పేతురు 1:19), సంఘము అబ్రాహాము యొక్క సంతతిగాను (గలతీ. 3:7) అనేకమంది క్రైస్తవులకు ఎరుకయ్యే ఉంది.[28] లేఖనంలో మనకెదురైనప్పుడు మిగిలిన గురుతులను ఆలోచన చేద్దాం. ప్రస్తుతానికి, ఈ నాలుగు రకాల గురుతులతో పరిచయం కలిగియుంటే చాలు.

ఈ పాఠంలోని అనేక వివరాలతో నీవు కలత చెందనవసరం లేదని నేను మరోసారి కోరుతున్నా. ఈ క్రింద యివ్వబడిన ప్రశ్నలను చూచేటప్పుడు, లేఖన భాగానికి వెళ్లి, జవాబులను గుర్తించు, నీవు గుర్తుంచుకోవలసిన అధిక ప్రాముఖ్యమైన వాస్తవాలను అవి తెలియజేస్తాయి.

ఇంకను నీవు నాతో ఉన్నావా? ప్రకటన గ్రంథం చదివి దాన్ని గ్రహించాలనే పట్టుదలతో ఉన్నావా? అలాగైనట్టయితే, నిరాశపడవద్దు. నీ తల పైకి ఎత్తుకో నీవు సరిగానే వెళ్లుతున్నావు! ఇంకొక్క పరిచయ పాఠముంది. తరువాత మనం ప్రకటన గ్రంథ రచనలోనికి వెళ్లతాం!

## సూచనలు

[1]"కనపరచు" అనేది గ్రీకు పదం యొక్క అక్షరార్థం. NASBలో "తెలియజేయు" అని ఉంది లేక "signified" అని మార్జిన్‌లో ఉంది. [2]*Bagster's Analytical Greek Lexicon* (1971), s.v. "signify." [3]W. E. Vine, *The Expanded Vine's Expository Dictionary of New Testament Words*, ed. John R. Kohlenberger III with James A. Swanson (Minneapolis, Minn.: Bethany House Publishers, 1984), 1043. [4]ప్రకటనలో వందలకొలది పాతనిబంధన రిఫెరెన్సులున్నాయి గాని సరైన కొటేషన్ ఒక్కటి కూడా లేదు. Ferrell Jenkins, *The Old Testament in the Book of Revelation* (Marion, Ind.: Cogdill Foundation Publications, 1972). [5]ప్రకటన 7:4–8 గురించిన తదుపరి వ్యాఖ్యానాలకు "తుఫాను నడుమ నిశ్చలత" అనే పాఠమును చూడు. [6]జూలియస్ "తొలి చక్రవర్తియా" కాదా అనే ప్రశ్న ఉంది. "ప్రజాభిప్రాయంలో జూలియస్ సీజర్ తొలి రోమా చక్రవర్తి; ఖచ్చితమైన రాజ్యంగ చట్టంలో, సామ్రాజ్యమంతటిని స్థిరంగా నిలిపిన మొదటివాడు ఆగస్టస్" (*Worthy Is the Lamb* [Nashville: Broadman Press, 1951], 81). "'Praenomen Imperatoris' అని జూలియస్ సీజర్ తన్ను గూర్చి చెప్పుకున్నా, Imperator కంటెను అతడు నియంతగానే వ్యవహరించాడు" (*The Apocalypse of St. John* [Cambridge: MacMillan Co., 1908; reprint, Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., n.d.], 220). [7]బైబిల్లో కైసరు (Caesar) అనేది చక్రవర్తులకు ఉపయోగింపబడింది. [8]ఆక్టేవియన్ పరిపాలన క్రీ.శ. 31లో ఆరంభమైనట్టు కొందరు అభిప్రాయపడ్డారు. [9]*Koine* అంటే "సాధారణమైన" అని అర్థం. *Koine* Greek సామాన్యులు మాట్లాడే బాష. [10]ఇది సామ్రాజ్య వ్యాప్తమైన హింసకాదు. కాని తరువాత హింసకు యిది శ్రీకారం చుట్టింది.

[11]ప్రకటనకు సంబంధించి ఈ వదంతిని వివరిస్తాను. [12]అతడు తన సహోదరుడైన డొమిషియన్‌చే పాడుచేయబడ్డాడని కొందరి అనువాదం. [13]డొమిషియన్ పాలనయొక్క సంక్షిప్త వర్ణన William Barclay యిచ్చాడు, *The Revelation of John*, vol. 2, rev. ed., The Daily Study Bible Series (Philadelphia: Westminster Press, 1976), 139-41. [14]ఈ సంచికలో రోమన్ సామ్రాజ్యం పటం చూడండి. [15]ప్రతి పట్టణంలోను ఆరాధనను అమలుచేసేది *praefectus urbi* అనే అధికార బృందం. ప్రతి పట్టణంలోను ప్రతినిధులు శక్తివంతమైన *concilia*గా ఉండి, చక్రవర్తికి విగ్రహాలను, ఆరాధనలకు బలిపీఠాలను కట్టుతూ, దేశీయ మతాన్ని అన్ని విధాల వృద్ధిచేస్తుంటారు. [16]Hugo McCord, *The Royal Route of Revelation* (Nashville: 20th Century Christian, 1976), 13. ఒక వ్యక్తి క్రైస్తవుడో కాదో తెలిసికొనడానికి నిర్ణయించే పరీక్షే ఆ ధూప వేదికమీద కొంచెం ధూపం వేయడం (నిజమైన క్రైస్తవులు చేయరు). ఈ పరీక్షను రూపించింది డొమిషియన్ అని చెప్పుతారు. [17]వారెందుకు చేయరో గ్రహించడానికి 1 కొరింథీ. 8:5, 6; ఎఫెసీ. 5:4, 5; అపొ. 4:12లను చూడు. ఆ ధూపం వేసినవారిని స్థానిక సంఘాలు సహవాసంనుండి దూరం చేశాయి. [18]S. Angus, "Roman Empire," *The International Standard Bible Encyclopedia*, gen. ed. James Orr (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1960), 4:2598-99. [19]Ibid., 4:2598. [20]డొమిషియన్ను 13:1–10లో ఉన్న సముద్ర మృగానికి చూడు, క్లౌదియ కాలంలోని వర్తక విజయానికి 18:11–13ని చూడు. 17:10, 11 ప్రకటన చక్రవర్తుల పేర్లన్నియు చూడు.

[21]S. Angusనుండి ఈ మెటీరియల్లో ఎక్కువ భాగం సేకరింపబడింది, "Roman Empire and Christianity," in *International Standard Bible Encyclopedia*, ed. James Orr (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1960) 4:2598-611. ఈ అంశంపై యింకా చదవాలంటే - Ray Summers, *Worthy Is the Lamb* (Nashville: Broadman Press, 1951), 87-88 చూడు. [22]*Grolier Multimedia Encyclopedia* (1995), s.v. "పార్తీయ," by Richard N. Frye. [23]"ముఖ్యమైన సూచనలు,

ఆశ్చర్యకరమైన గురుతులు" ఈ పుస్తకంలో చూడు. [24]"రోము ఎందుకు పతనమయ్యిందో" అనే వ్యాసం ఈ పుస్తకంలో చూడు. [25]Ray Summers, *Worthy Is the Lamb* (Nashville: Broadman Press, 1951), 43. [26]Quoted in Paul Lee Tan, *Encyclopedia of 7,700 Illustrations*: *Signs of the Times* (Rockville, Md.: Assurance Publishers, 1979), 250. [27]James M. Efird, *Revelation for Today* (Nashville: Abingdon Press, 1989), 25. [28]William Hendriksen listed some of the New Testament passages reflected in the Book of Revelation in *More than Conquerors* (Grand Rapids, Mich.: Baker Book House, 1954), 61.

## రివ్యూ మరియు చర్చ కొరకైన ప్రశ్నలు

1. నాలుగు రకాలైన గురుతులేవి?
2. పాత నిబంధన రెఫరెన్సును ప్రకటన రెఫరెన్సుతో పోల్చినప్పుడు "మలుపును" నీవు గమనించు. ఆ "మలుపు"లో రచయిత అర్థమేమి, అందులో గుప్తమైనదేమి?
3. రోమా సామ్రాజ్య స్థాపకుడెవరు?
4. తొలి రోమా చక్రవర్తి ఎవరు?
5. పౌలు విన్నవించుకున్న చక్రవర్తి ఎవరు?
6. క్రైస్తవులపై ప్రత్యేకించి హింసను ప్రారంభించిన చక్రవర్తి ఎవరు?
7. నీరో మరణానంతరం ఏ కట్టుకథ లేచింది?
8. యెరూషలేమును నాశనం చేసిన ఏ సైన్యాధిపతి చక్రవర్తి అయ్యాడు?
9. టైటస్ కాలంలో గుర్తింపదగిన ఏ ప్రకృతి వైపరీత్యం సంభవించింది?
10. క్రైస్తవులను సామ్రాజ్య వ్యాప్తంగా హింసింపనారంభించిన చక్రవర్తి ఎవరు?
11. ఒక వ్యక్తి క్రైస్తవుడో కాదో తెలిసికొనడానికి (డొమిషియనుకు ఆరోపించిన) పరీక్ష ఏది? (జవాబు కొరకు సూచనలను చూడు.)
12. క్రైస్తవులు శిక్షింపబడిన అయిదు విధానాలు ఈ పాఠం పేర్కొంటుంది. వాటిని తెలుపుము.

## క్రీ.శ. 100 ప్రాంతంలోని రోమా సామ్రాజ్యం

